క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

మద్దిపాడు: మద్దిపాడు 33 కేవీ ఫీడర్లో కండక్టర్లు మారుస్తున్న క్రమంలో మండలంలోని ఉత్తరం వైపు 33/11 కేవీ, మద్దిపాడు సబ్ స్టేషన్‌లోని 11 కేవీ, ఇనమనమెళ్లూరు ఫీడర్‌లోని బసవన్నపాలెం, నందిపాడు, కోవివారిపాలెం, ఇనమనమెళ్లూరు గ్రామాలకు సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ చెన్నారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు వెల్లడించారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

శాస్త్రోక్తంగా చండీ హోమం



పుష్పాలంకరణలో రాజరాజేశ్వరి అమ్మవారు

ఒంగోలు మెట్రో: స్థానిక గద్దలగుంట బుర్రబావి దగ్గర శ్రీ మహాకాళి, మహాలక్ష్మి, మహాసరస్వతి, రాజరాజేశ్వరి దేవస్థానంలో త్రయోవింశతి 23వ వార్షిక మహా కుంభాభిషేక మహోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం ఉదయం సర్వతోభద్ర మండల దేవతా, వాస్తు నవగ్రహ మండపారాధన, చండీ హోమాన్ని మాచవోలు రాజశేఖర్ శాస్త్రి, మాచవోలు రమేష్ శాస్త్రి పర్యవేక్షణలో ఆలయ అర్చక స్వామి గుండు కౌండిన్య శర్మ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం ఆరు గంటలకు అమ్మవారికి పుష్పాలంకరణ, ప్రత్యంగిరి యాగ మండప దేవత, నక్షత్ర హోమం, అమ్మవారికి అష్టోత్తర శత కలశ అభిషేకం, పెళ్లి కావాల్సిన యువతీ యువకులకు వివాహం కావడానికి విశేష మహా పూజ నిర్వహించారు. సుహాసినిలకు అమ్మవారి పసుపు, కుంకుమ, గాజులు, తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో స్థానిక భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి దర్శనం చేసుకున్నారు.


రాజంపల్లి సర్పంచ్ చెక్‌పవర్ పునరుద్ధరణ

దర్శి (కురిచేడు): దర్శి మండలం రాజంపల్లి గ్రామ సర్పంచ్ వనం అన్నపూర్ణ చెక్ పవర్‌ను పునరుద్ధరిస్తూ జిల్లా పంచాయతీ అధికారి జి.వెంకటనాయుడు ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో 15వ ఆర్థిక సంఘం నిధులు నిబంధనలకు విరుద్ధంగా డ్రా చేసి దుర్వినియోగం చేశారని సర్పంచ్ అన్నపూర్ణపై ఉపసర్పంచ్ వజ్జా నాగమణి అభియోగం మోపడంతో చెక్ పవర్ రద్దుచేశారు. అన్నపూర్ణ హైకోర్టును ఆశ్రయించి ఇంటీరియమ్ ఉత్తర్వులు పొందటంతో ఆమెకు చెక్కుపవర్‌ను పునరుద్ధరించినట్లు డీపీవో తెలిపారు. సంబంధిత అధికారులందరూ అన్నపూర్ణ సంతకంతో నిధులు డ్రా చేసేందుకు ఆమోదించాలని ఆదేశించారు.

ఎంఆర్‌పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకోవాలి

దర్శి (కురిచేడు): ఎస్సీ వర్గీకరణ సాధించుకున్న తర్వాత మొదటిసారి వస్తున్న ఎంఆర్‌పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకుందామని జిల్లా ఇన్‌చార్జి సొట్ట నరేంద్రమాదిగ పిలుపునిచ్చారు. దర్శిలో ఆదివారం ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ, ఎంఈఎఫ్ ముఖ్యనేతలతో సమావేశం నిర్వహించారు. గత 30 ఏళ్లుగా మాదిగ జాతి కోసం పోరాడిన ఎంఆర్‌పీఎస్ ఇక నుంచి దేశం కోసం పోరాడబోతున్న నేపథ్యంలో ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ, ఇతర అనుబంధ సంఘాల గ్రామ, మండల స్థాయి కమిటీలను బలోపేతం చేసి భవిష్యత్ ఉద్యమానికి సిద్ధం కావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎంఎస్‌పీ జిల్లా ఇన్‌చార్జి తొరటి ఆనంద్, నియోజకవర్గ ఇన్‌చార్జి యోగేశ్వరరావు, ఎంఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మసీందర్, ఎంఈఎఫ్ నాయకుడు రామారావు, తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతకు ఎగనామం!



- ఒక్క సంతనూతలపాడు మండలంలోనే 914 మంది రైతులకు పంగనామం
- గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మండలంలో 7,150 మందికి రైతు భరోసా నగదు
- ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో 6,236 మందితోనే అన్నదాత సుఖీభవ జాబితా

సంతనూతలపాడు: కూటమి పాలనలో అన్నదాతకు అన్నీ కష్టనష్టాలే ఎదురవుతున్నాయి. సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినప్పటికీ రైతుకు ఏ విధంగానూ మేలు చేసిన దాఖలాలు లేవు. పంటలకు గిట్టుబాటు ధర లేకపోవడంతో అన్నిరకాల పంటలు సాగు చేసిన రైతులు తీవ్రంగా నష్టపోయారు. పొగాకు రైతుల పరిస్థితి మరీ దారుణంగా ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం చోద్యం చూసేందుకే పరిమితమైంది. రైతులను ఆదుకునేందుకు కనీస చర్యలు కూడా చేపట్టలేదు. చివరకు ఏడాది తర్వాత ఎన్నికల హామీల్లోని అన్నదాత సుఖీభవ పథకం అమలు చేసేందుకు తయారు చేసిన జాబితాలోనూ కోత విధించింది. ఈ పథకం ద్వారా రైతుకు ఏడాదికి రూ.20 వేల పెట్టుబడి సాయం అందిస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన చంద్రబాబు.. ప్రస్తుతం మాట మార్చారు. అందులో రూ.6 వేలు పీఎం కిసాన్ యోజన ద్వారా కేంద్రం ఇచ్చే సాయాన్ని కూడా కలిపివేశారు. మిగిలిన రూ.14 వేలు మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం ఇస్తుందని, దాన్ని కూడా మూడు విడతలుగా జమ చేస్తుందని చెప్పడంతో రైతులు తీవ్ర నిరాశకు గురయ్యారు. మొదటి విడతగా రూ.5 వేలు జమ చేసేందుకు తయారు చేసిన జాబితాలోనూ రైతుల సంఖ్య తగ్గించడంతో అన్నదాతలు పూర్తిస్థాయిలో నిరాశ నిస్పృహలకు లోనవుతున్నారు.

సంతనూతలపాడు మండల జాబితాలో భారీగా కోత...

సంతనూతలపాడు మండలంలో 914 మంది రైతులను అన్నదాత సుఖీభవ జాబితాలో తొలగించినట్లు గణాంకాలు చెబుతున్నాయి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రైతు భరోసా ఇచ్చినట్లే ఇప్పుడు కూడా అన్నదాత సుఖీభవ నగదు అందుతుందని రైతులు ఆశపడ్డారు. కానీ, రైతులకు కూటమి ప్రభుత్వం షాక్ ఇచ్చింది. సంక్షేమ పథకాల్లో కొర్రీలు పెట్టి కోతలు విధిస్తోంది. ఈ విషయంలో రైతులనూ వదిలిపెట్టేది లేదని తాజాగా తయారు చేసిన అన్నదాత సుఖీభవ జాబితా చూస్తే స్పష్టమవుతోంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సంతనూతలపాడు మండలంలో 7,150 మంది రైతులకు రైతు భరోసా పథకం వర్తించింది. ఏడాదికి రూ.13,500 వారి బ్యాంకు ఖాతాల్లో జమయింది. దీంతోపాటు పీఎం కిసాన్ ద్వారా రూ.6 వేలు నగదు అందింది.

కూటమి పాలనలో 6,236 మందితోనే జాబితా...

ప్రస్తుత కూటమి ప్రభుత్వ పాలనలో సంతనూతలపాడు మండలంలో 6,236 మందికి మాత్రమే అన్నదాత సుఖీభవ నగదు పడనుంది. వీరిలో కూడా కొంతమందికి ఇంకా ఈకేవైసీ కాలేదని అధికారులు చెబుతున్నారు. గత ప్రభుత్వంతో పోల్చుకుంటే 914 మందికి కూటమి ప్రభుత్వం ఎగనామం పెట్టింది. వీరి పరిస్థితి ఏమిటనేది ఎవరికీ అర్థంకాకుండా ఉంది. ఇప్పటికీ ఈ రైతులకు తాము అనర్హులమయ్యామనే విషయం తెలియదు. రేపోమాపో రైతు సేవా కేంద్రాల వద్ద జాబితా చూస్తే అప్పుడు అసలు విషయం బయటపడుతుంది. వీరిలో అర్హులైన రైతులకు మళ్లీ ఇస్తారా..లేదా..? అనే విషయం కూడా ఎవరికీ తెలియదు.

> **లబ్ధిదారుల జాబితా సిద్ధం**
>
> ఉన్నతాధికారుల నుంచి మాకొచ్చిన జాబితా మేరకు సంతనూతలపాడు మండలంలో అన్నదాత సుఖీభవ పథకం లబ్ధిదారులు 6,236 మంది మాత్రమే. వీరిలో ఇంకా కొంత మందికి ఈకేవైసీ కాలేదు. వీరికి ఆటో అప్డేట్ ద్వారా ఈకేవైసీ చేస్తున్నాం. వీరు ఇక ప్రత్యేకంగా ఈకేవైసీ చేయాల్సిన పనిలేదు. జాబితాలో పేరున్న రైతుల ఖాతాల్లో త్వరలో ప్రభుత్వం నగదు జమ చేసే అవకాశం ఉంది.
>
> – పావని, మండల వ్యవసాయాధికారి, సంతనూతలపాడు

యువత పోరును విజయవంతం చేయాలి

కొత్తపట్నం: వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, ఒంగోలు నియోజకవర్గ సమన్వయకర్త చుండూరి రవిబాబు ఆదేశాల మేరకు సోమవారం ఒంగోలులో తలపెట్టిన యువత పోరు శాంతియుత నిరసన ర్యాలీని విజయవంతం చేయాలని పార్టీ కొత్తపట్నం మండల అధ్యక్షుడు, ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం ఉదయం 9 గంటలకు ఒంగోలు అంబేడ్కర్ భవన్ నుంచి కలెక్టర్ వరకు శాంతియుత ర్యాలీ నిర్వహించిన అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేయనున్నట్లు చెప్పారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం, విద్యార్థి విభాగం నాయకులు, కార్యకర్తలు, యువకులు, వైఎస్సార్ సీపీ నేతలు, ఎంపీటీసీలు, మాజీ ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మాజీ సర్పంచ్‌లు, బూత్ కన్వీనర్లు పాల్గొని విజయవంతం చేయాలని అంజిరెడ్డి కోరారు.

170 మందికి ఉచిత వైద్య పరీక్షలు

ఒంగోలు టౌన్: వాసవీ క్లబ్, ఒంగోలు మహిళా విజన్, శ్రీరాం సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఒంగోలు నగరంలోని చివుకులవారివీధిలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 170 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు చేశారు. సుగర్, హెచ్‌బీఏ1సీ, హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు. డాక్టర్ చాపల వంశీకృష్ణ, వాసవీ క్లబ్ మహిళా విజన్ అధ్యక్షురాలు కారంశెట్టి వెంకట సునీత, డాక్టర్ చాపల శాంతకుమారి, జనరల్ ఫిజీషియన్ సానల ధీరజ్‌బాబు, పువ్వాడ నారాయణ, గార్లపాటి బ్రహ్మానందం, చలువాది సత్యనారాయణ, మాడిశెట్టి భవాని, అరవింద లక్ష్మి, ఆత్మకూరి శ్రావ్య, దాచేపల్లి రవి, షేక్ ఖాశీంసైదా, చలువాది కవితారాణి, సాయి సిద్దు, దేవతి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదపు అంచుల్లో ప్రయాణం



లారీ బాడీ వెలుపలకు గ్రానైట్ రాళ్లు వేసుకుని ఇతర వాహనాలకు ప్రమాదకరంగా తరలిస్తున్న దృశ్యం



జారిపడేలా గ్రానైట్ రాళ్లు వేసుకుని వెళ్తున్న టిప్పర్

చీమకుర్తి రూరల్: చీమకుర్తి మండలంలోని గ్రానైట్ గనుల నుంచి గ్రానైట్ రాళ్లతో పలు ప్రాంతాలకు ప్రయాణిస్తున్న వాహనాలతో నిత్యం ప్రమాదాలు పొంచి ఉంటున్నాయి. ఒంగోలులోని ఎస్టేట్, సంతనూతలపాడు, గుండ్లాపల్లి గ్రోత్ సెంటర్, తదితర ప్రాంతాలకు చీమకుర్తి మండలంలోని గ్రానైట్ గనుల నుంచి ప్రతిరోజూ ముడి రాళ్లను బ్లాకుల రూపంలో తరలిస్తుంటారు. టిప్పర్లు, లారీ టారస్‌లు, ట్రాలీలపై పరిమితికి మించి అధిక టన్నేజీతో వాహనం నుంచి బయటకు వచ్చేలా ఉన్నప్పటికీ నిర్లక్ష్యంగా వాటిని రవాణా చేస్తుండటంతో రోడ్డుపై ప్రయాణిస్తున్న సమయంలో ఇతర వాహనాలకు ప్రమాదకరంగా అవి మారుతున్నాయి. ఇలా రవాణా చేస్తున్న గ్రానైట్ రాళ్లు జారిపడి గతంలో ప్రమాదాలు కూడా జరిగాయి. కొన్నిసార్లు వాహనాల సైజు కంటే ఎక్కువ పొడవు, వెడల్పు ఉన్న రాళ్లను కనీస జాగ్రత్తలు, రక్షణ చర్యలు తీసుకోకుండా తరలిస్తుండటంతో అవి పక్కన వెళ్తున్న వాహనాలకు తగిలిన సందర్భాలు కూడా ఉన్నాయి. కొన్ని వాహనాలకు మైనింగ్ బిల్లులు లేకపోతుండటంతో సంబంధిత అధికారులు పట్టుకోకుండా వేగంగా గమ్యం చేరుకోవాలనే ఉద్దేశంతో అతివేగంగా వెళ్తుండటం వలన కూడా గ్రానైట్ రాళ్లు తరలిస్తున్న వాహనాలతో ప్రమాదాలు జరుగుతున్నాయి. రాత్రి వేళల్లో ఇలాంటి ప్రమాదాలు జరిగే అవకాశం అధికంగా ఉంటోంది. గ్రానైట్ లారీల పక్కగా వెళ్లాలంటేనే కార్లు, ఆటోలు, ద్విచక్రవాహనదారులు హడలిపోతున్నారు. ఆ వాహనాల పక్కగా వెళ్లే సమయంలో గ్రానైట్ రాళ్లు జారిపడితే ఆ ప్రమాదాన్ని ఊహించలేమంటూ ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి పరిమితికి మించి ఓవర్ టన్నేజీతో పాటు సరైన ప్యాకింగ్ లేకుండా గ్రానైట్ రాళ్లు రవాణా చేసే వారిపై చర్యలు తీసుకోవాలని, ఎలాంటి ప్రమాదాలు జరగకముందే జాగ్రత్తలు తీసుకోవాలని ప్రయాణికులు, వాహనదారులు కోరుతున్నారు.

ఘనంగా ఎల్లమ్మ తల్లి కొలుపులు



ఎల్లమ్మ తల్లి ఆలయంలో పూజలు చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు మేరుగు నాగార్జున, దుంపా రమణమ్మ

- పాల్గొన్న మాజీ మంత్రి మేరుగు నాగార్జున, వైఎస్సార్ సీపీ నాయకులు

సంతనూతలపాడు: మండలంలోని గుమ్మళంపాడు గ్రామంలో నువ్వుల, నెప్పల, బొడ్డపాటి కుటుంబీకులు ఎల్లమ్మ తల్లి కొలుపులను ఘనంగా నిర్వహిస్తున్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ నాయకుల ఆహ్వానం మేరకు ఆదివారం ఆ పార్టీ సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ మంత్రి మేరుగు నాగార్జున, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు దుంపా రమణమ్మ ముఖ్య అతిథులుగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పార్టీ సంతనూతలపాడు మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి, ఎంపీపీ విజయ, సొసైటీ మాజీ ప్రెసిడెంట్ దుంపా యలమందారెడ్డి, బొక్కిషం శివరామయ్య, సర్పంచ్లు పార్ధసాహెబ్, తానిపర్తి వెంకటరెడ్డి, మహిళాధ్యక్షురాలు సీతమ్మ, నాయకులు మొలకలపల్లి సుబ్బారావు, బొడ్డపాటి బ్రహ్మయ్య, బొడ్డపాటి ఆంజనేయులు, మంగపాటి శ్రీను, బొడ్డపాటి శ్రీను, కార్యకర్తలు పాల్గొన్నారు. కొలుపులు ముగింపు సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

రైల్వేస్టేషన్‌లో సమస్యల తిష్ట



దొనకొండ రైల్వేస్టేషన్



స్టేషన్ ఎదురుగా అసంపూర్తిగా నిలిచిపోయిన అభివృద్ధి పనులు

దొనకొండ: అమృత భారత్ పథకం కింద గుంటూరు రైల్వే డివిజన్‌లోని దొనకొండ రైల్వేస్టేషన్ ఆధునికీకరణకు గతంలో కేంద్ర ప్రభుత్వం రూ.18 కోట్లు మంజూరు చేసింది. రైల్వే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆ నిధులతో హడావిడిగా అభివృద్ధి పనులు చేపట్టారు. ఎంతో ఆర్భాటంగా చేపట్టిన అభివృద్ధి పనులు పూర్తికాకుండా నిలిచిపోవడంతో దొనకొండ రైల్వేస్టేషన్‌లో సమస్యలు తిష్టవేశాయి. స్టేషన్ ఎదురుగా అందమైన పార్కు, పాదచారులు నడవడానికి సీసీ రోడ్లు, సైడు కాలువలు, మరుగుదొడ్లు పనులు మొదలు పెట్టారు. ఆరు నెలల నుంచి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా ఆయా పనుల పరిస్థితి నెలకొంది. అధికారులు మాత్రం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తూ పట్టించుకోవడం లేదు. 20 శాతం కూడా పనులు చేపట్టలేదు. ఫ్లై ఓవర్ బ్రిడ్జి అసంపూర్తిగా నిలిచిపోయింది. 2వ ప్లాట్‌ఫాం పనులు చేపట్టలేదు. ఎవరైనా అభివృద్ధి పనుల గురించి అడిగితే నిధులు లేవు, కాంట్రాక్టర్ ముందుకు రాలేదంటూ సమాధానం దాటేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం మాత్రం గతంలో నిధులు మంజూరు చేసిన సమయంలో ఆరు నెలల్లో పనులు పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేసింది. గుంతకల్లు, హుబ్లీ, తిరుపతి, హైదరాబాద్, గుంటూరు, విజయవాడ, విశాఖపట్నం, ఒరిస్సా తదితర ప్రాంతాలకు దొనకొండ రైల్వేస్టేషన్ మీదుగా రైళ్ల రాకపోకలు సాగిస్తుంటాయి. రోజుకు 10 రైళ్ల వరకూ తిరుగుతుంటాయి. అలాంటి దొనకొండ రైల్వేస్టేషన్‌లో అభివృద్ధి పనులు నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అభివృద్ధి పనుల కోసం తోలిన ఇటుక, సిమెంట్, ఐరన్ ఎక్కడికక్కడే ఉండిపోవడంతో మరింత అసౌకర్యానికి గురవుతున్నారు. రైల్వే అధికారులు స్పందించి అభివృద్ధి పనులు పూర్తి చేయించి సమస్యలు పరిష్కరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

యోగా పేరుతో రూ.కోట్లు వృథా ఖర్చు



మాట్లాడుతున్న నీలం నాగేంద్రరావు

ఒంగోలు వన్‌టౌన్: ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ నిధులను విడుదల చేయకుండా యోగా పేరుతో కోట్ల రూపాయల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు నీలం నాగేంద్రరావు ప్రభుత్వాన్ని విమర్శించారు. ఒంగోలులోని కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సామాజిక న్యాయానికి పాతర వేసి యోగాంధ్ర పేరుతో కూటమి ప్రభుత్వం సనాతన ధర్మాన్ని ప్రచారం చేస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం దాటినా ముఖ్యమంత్రి అధ్యక్షతన 6 నెలలకు ఒక సారి జరగాల్సిన ఎస్సీ, ఎస్టీ, స్టేట్ లెవల్ విజిలెన్సు అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం ఇప్పటి వరకూ నిర్వహించలేదన్నారు. ప్రతి నెలా 30వ తేదీ మండల స్థాయిలో జరగాల్సిన సివిల్ రైట్స్ డేను రాష్ట్రంలో ఎక్కడా అమలు చేయడం లేదన్నారు. సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి సొంత జిల్లాలోనే మూడు నెలలకు ఒక సారి జరగాల్సిన ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ సమావేశం ఒక్క సారి కూడా నిర్వహించలేదని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్‌లకు కేటాయించిన రూ.431 కోట్లలో ఒక్క రూపాయి కూడా ఎస్సీలకు విడుదల చేయలేదన్నారు. బీసీలతో పాటూ కాపులకు కూడా పూలే జయంతి రోజున రుణ మంజూరు కార్యక్రమాన్ని నిర్వహించి, అనంతరం రుణాలను నిలిపివేసిందని మండిపడ్డారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ కార్పొరేషన్‌ల నిధులను తల్లికి వందనం వంటి కార్యక్రమాలకు మళ్లించారన్నారు.

ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు

పెద్దారవీడు: మండలంలో గుండంచర్ల గ్రామం సమీపంలో నల్లమల అడవిలో వెలసిన గంగా భవానీ వేనూతల కాటమరాజుస్వామి, పెద్దారవీడు గ్రామం సమీపంలో వెలసిన అంకాళమ్మ దేవత, ఎస్ కొత్తపల్లి గ్రామం సమీపంలో వెలసిన శ్రీనాగాంజనేయస్వామి పుట్టకు భక్తులు భక్తిశ్రద్ధలతో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. కాటమరాజు స్వామి, గంగభవానీ దేవతకు అభిషేకాలు, పూజలు చేసి పట్టువస్త్రాలు, పసుపు, కుంకుమ, పూలమాలతో ప్రత్యేకంగా అలంకరించారు. మహిళలు అంకాళమ్మ దేవతకు మహిళలు పసుపు, కుంకుమ, చీరలు, గాజులు, నాగమయ్యపుట్టకు పాలు, పండ్లు సమర్పించారు. అంకాళమ్మ దేవతను పట్టు వస్త్రాలు, ఆభరణాలు, పూలమాలతో ప్రత్యేకంగా అలంకరించారు. మహిళలు ఆలయం ప్రాంగణంలో పొంగళ్లు తయారు చేసి స్వామి, అమ్మవార్లకు నైవేద్యం చెల్లించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు దర్శించుకుని, మొక్కులు చెల్లించారు.

ఘనంగా శ్రీకృష్ణుని కళ్యాణ మహోత్సవం



రుక్మిణి, సత్యభామ సమేత శ్రీకృష్ణ కళ్యాణ మహోత్సవంలో అర్చక స్వాములు, దంపతులు

ఒంగోలు మెట్రో: మండల పరిధి కొప్పోలు గ్రామంలో గోపాలకృష్ణ స్వామి మందిరం 8వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం స్వామికి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. ఉదయం 11 గంటలకు సత్యభామ, రుక్మిణి సమేత శ్రీకృష్ణ కళ్యాణ మహోత్సవాన్ని వేద పండితులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కళ్యాణ క్రతువులో బాపట్ల సనత్ కుమార్ దంపతులు, సుబ్బారావు దంపతులు, దొడ్డ పవన్ కుమార్ దంపతులు, కొండరాజు సురేష్ దంపతులు, మందిర వ్యవస్థాపక అధ్యక్షుడు బాపట్ల కొండయ్య, మొడిపోయిన వెంకటరత్నం, అధ్యక్షుడు కొప్పుల సీతారామయ్య, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

గాయత్రీమాతకు లక్షమల్లెలార్చన



సామూహిక కుంకుమార్చనలో మహిళా భక్తులు



ప్రత్యేక అలంకరణలో వేదమాత గాయత్రీ అమ్మవారు

ఒంగోలు మెట్రో: స్థానిక మంగమూరు రోడ్డులోని గాయత్రి మందిరంలో ఆదివారం అమ్మవారికి లక్ష మల్లెల అర్చన, అభిషేకం ఘనంగా నిర్వహించారు. అనంతరం వివిధ రకాల పుష్పాలతో అమ్మవారి మూలవిరాట్‌ను అలంకరించి దేవి ఖడ్గమాల అష్టోత్తర శతనామాలతో మహిళా భక్తుల చేత కుంకుమ పూజ నిర్వహించి, ధూప దీప మంగళ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో స్థానిక భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.